క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వే గేట్ సమీపంలో ఉన్న సురభి నిలయంలోని గోశాలలో లయన్స్ క్లబ్, బీజేపీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మల్చలం మురళీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా గోపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోరమోని హరిభూషణ్‌పటేల్, నాయకులు నడికూడ యాదగిరియాదవ్, శ్రీనివాస్, నర్సింహ, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ క్యాకర్తల సమావేశం

మొయినాబాద్: బీఆర్‌ఎస్ మండల కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మొయినాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు మున్సిపాలిటీలోని పద్మావతి గార్డెన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, మున్సిపల్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు: కోనేరులో పడి మృతి చెందిన భక్తుడి కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం గుండాల అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది శివరాత్రి రోజున ఆలయంలోని కోనేరులో భక్తుడు పెరుమాళ్ల ఓమేష్ నీట మునిగి చనిపోయాడు. ఈ మేరకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును ఆదివారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే.. మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సందీప్ రెడ్డి, కిసాన్‌సెల్ తాలూకా అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, రాజేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అరుణ్, అంజయ్య, అర్చకులు కష్టయ్య, నరహరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆదివారం ఆలయంలో గణపతి పూజ, ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విగ్రహదాత కొండల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వీరయ్య, నాయకులు సాయిలు, కరుణాకర్‌గౌడ్, యాదయ్యగౌడ్, యాదయ్య, సుమన్, శంకర్, మధు, శంకర్, శివ, రాఘవేంద్ర, శ్రీను, కిష్టయ్య, ముత్యాలు, సత్తయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న సాధన సమితి నాయకులు

యాచారం: ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని మన ఆలోచన సాధన సమితి నాయకులు అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఆదివారం మండల పరిధి చౌదర్‌పల్లి గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొంపోజ్ నరహరి మాట్లాడుతూ.. ఐక్యంగా పోరాడి రిజర్వేషన్లు సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు నర్సింహచారి, నర్సింహ, జంగాచారి, నాగార్జున, శ్రీనువాస్‌చారి, శ్రీశైలం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



నిండుకుండలా మాలకుంట

❖ కుంటలకు జలకళ

ఇటీవల కురిసిన వర్షాలకు మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలోని మూలకుంట, మాలకుంటలు జలకళ సంతరించుకున్నాయి. వారం క్రితం కురిసిన వర్షాలతో మూలకుంట అలుగు పారింది. మాలకుంట నిండుకుండలా మారడంతో అధికారులు నిర్మించిన శ్మశానవాటిక, స్నానపు గదులు నీట మునిగాయి. బోరుబావుల నీటి మట్టం పెరిగాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– మొయినాబాద్‌రూరల్



వర్షం నీటితో కళకళలాడుతున్న మూలకుంట

ఊరించారు.. ఊసెత్తడం మరిచారు



మండల పరిషత్ కార్యాలయం

- రాజీవ్ యువవికాసం పథకం అమలుపై స్పష్టత కరువు
- ఆశగా దరఖాస్తుదారుల ఎదురుచూపు

కేశంపేట: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకంను అమలు చేసేందుకు కృషి చేసింది. అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్నా పథకం అమలుపైన స్పష్టత లేకుండా పోయింది. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువత నిరాశకు గురవుతున్నారు.

అమలులో జాప్యం

రాజీవ్ యువవికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగులు నఖాలు కాగితాలను మండల పరిషత్ కార్యాలయంలో అందించారు. ఈ పథకంలో రూ.50వేల నుంచి 4లక్షల వరకు రుణాలను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో రూ.50వేల నుంచి లక్షవరకు దరఖాస్తులు చేసుకున్న వారికి రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అందిస్తామని లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయినా అందించక పోవడంతో నిరుద్యోగులు నిరాశకు గురయ్యారు. మంత్రివర్గ సమావేశం అనంతరం అమలుపై నిర్ణయాలు తీసుకుంటారని తెలిపినా ఇప్పటికే మూడు, నాలుగు సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగిన పథకం అమలుపై ప్రభుత్వం ఊసెత్తడం లేదు.

మండలంలో ఇలా..

మండల పరిధిలోని 20 రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారుగా 1,700ల మంది నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారుగా అల్వాల 95, బైర్ఖాన్‌పల్లి 30, బోధునంపల్లి 37, చింతకుంటపల్లి 34, చౌలపల్లి 64, దత్తాయపల్లి 09, ఎక్లాస్ఖాన్‌పేట 83, ఇప్పలపల్లి 83, కాకునూర్ 58, కేశంపేట 208, కొత్తపేట 148, లేమామిడి 56, లింగంధన 38, నిర్దవెల్లి 130, పాపిరెడ్డిగూడ 135, పోమాల్‌పల్లి 148, సంగెం 86, సంతాపూర్ 59, తొమ్మిదిరేకుల 67, వేములనర్వ 103 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

పారదర్శకంగా రుణాలు అందించాలి



రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రుణాలు అందించాలి. నిరుద్యోగులు రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. కాలయాపన లేకుండా పారదర్శకంగా రుణాలను అందించాలి.

– మల్లూంకార్ శివాజీ, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి

హామీని నిలబెట్టుకోవాలి



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరుస్తామని హామీ ఇచ్చింది. నమ్మిన యువత ఓట్లు వేసి గెలిపించారు. అనంతరం యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి, జూన్‌లోనే లబ్ధిదారులకు రుణాలను ఇస్తామని హామీనిచ్చింది. నేటికీ యువతను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం.

– కమ్మేకర్ నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్, కొత్తపేట

ఘనంగా స్నేహితుల దినోత్సవం



సంబరాల్లో పాల్గొన్న స్నేహితులు

మొయినాబాద్‌రూరల్: అన్నదమ్ములుగా కలిసిమెలసి ఉండడంతో పాటు కష్టసుఖాలను పాలుపంచుకున్నప్పుడే స్నేహానికి అర్థం ఉంటుందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ మండల నాయకుడు కుమ్మరి రాము అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎన్కెపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దాదాపు 40 మంది స్నేహితులందరూ ఏకమై విద్యార్థి దశ నుంచి నేటి వ్యాపార ఉద్యోగాల్లో స్థిరపడి ఉన్న వారంతా కష్టసుఖాలను పాలుపంచుకున్నారు. ఒకరినొకరూ చేస్తున్న ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలను, కష్టసుఖాలను తెలియజేశారు. అనంతరం కేక్‌కట్ చేసి తినిపించుకున్నారు. అనంతరం కుమ్మరి రాము మాట్లాడుతూ.. ఎన్కెపల్లిలో చిన్నపెద్దా తారతమ్యం లేకుండా అన్నదమ్ములుగా, స్నేహితులుగా 20 సంవత్సరాల నుంచి అలాగే కొనసాగుతోందన్నారు. కలిసిమెలసి ఉండడంతో కష్టసుఖాల్లో పాలుపంచుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో దానయ్య, సుభాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: విద్యలో రాణించడం ద్వారా సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన సంగెం ప్రభాకర్ ప్రమోటర్ మోటివ్ ఎనాలిసిస్ ఆఫ్ జీఎస్‌ఆర్‌హెచ్ 1 ఇన్ బోనీఫిషెస్ అనే అంశంపై పరిశోధన జరిపిన గ్రంథాన్ని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం బాబయ్య దూసకల్ గ్రామానికి వెళ్లి సంగెం ప్రభాకర్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యలో రాణించిన వారికి సమాజంలో ప్రత్యేక స్థానం లభిస్తుందన్నారు. కృషి, పట్టుదల ఉంటే కానిది అసాధ్యమన్నారు. సంగెం ప్రభాకర్ పరిశోధన గ్రంథాన్ని యూనివర్సిటీకి అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలు



నాగర్‌గూడ చౌరస్తా వద్ద సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న నాయకులు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్: కార్మికుల హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీఐటీయూ సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని చందనవెళ్లి పారిశ్రామిక ప్రాంతంలో కంపెనీ కార్మికులకు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వలస కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని.. అయినప్పటికీ కార్మిక శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా సీఐటీయూ ముందుండి ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సీహెచ్ భీమయ్య, నాయకులు వడ్డే అంజయ్య, బాల్‌రాజ్, మానయ్య, సాయిలు, నర్సింలు తదితరులు ఉన్నారు.

ప్రజాసేవే 'రాధాకృష్ణ' లక్ష్యం



యువతికి నగదు, చీరను బహూకరిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: ప్రజాసేవే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని, ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధి టాక్‌రాజ్‌గూడతండా, కానుగుబావితండాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. కానుగుబావితండాలో దేవీ– కిషన్ దంపతుల కూతురు మీన వివాహానికి రూ.21 వేల నగదు, పట్టుచీరను బహూకరించారు. మాజీ ఉప సర్పంచ్ శారద రూ.25 వేలు, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5 వేలు, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యా రూ.5 వేలు, శ్రీను రూ.10 వేలు, లక్ష్మణ్ రూ.10 వేలు, శ్రీను రూ.5 వేలు సహాయంగా అందజేశారు. టాక్‌రాజ్‌గూడతండాలో అనిత– దేవుల దంపతుల కుమార్తె నిహారిక వివాహానికి రూ.21 వేలు, పట్టుచీరను అందజేశారు. కోట్యానాయక్ రూ.10 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, సాయిలు, మాజీ ఎంపీటీసీలు చంద్రమౌళి, రమేశ్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, జగన్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ధర్మానాయక్, రాములునాయక్, కృష్ణయ్య, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, పాండు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం శ్రీకంఠ మహేశ్వరస్వామి, ఆదివారం పోచమ్మ, ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గౌడ కులస్తులు.. గ్రామస్తులతో కలిసి ఆలయాలకు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి దేవతా మూర్తులకు నైవేద్యంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆదిబట్లలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్, మంగళ్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామాల్లో బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి, నైవేద్యంగా దేవతలకు బోనం సర్పించారు. పోతురాజుల ఆటలు ఆకట్టుకున్నాయి.



అబ్దుల్లాపూర్‌మెట్: కవాడిపల్లిలో బోనంతో మహిళలు

స్నేహితుడి కుటుంబానికి సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

ఆమనగల్లు: స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రులు అండగా నిలిచారు. జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీసాల మహేశ్ ఇటీవల మృతి చెందాడు. తలకొండపల్లి మండలం రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007– 2008లో మృతుడితో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు.. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం బాధిత కుటుంబానికి రూ.29,500లు ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, మల్లేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో శిక్షణ.. బాలికలకు రక్షణ



కర్ర సాధన చేస్తున్న విద్యార్థినులు

- ఆత్మ విశ్వాసమే ఆయుధంగా ముందుకు..
- కరాటేలో రాణిస్తున్న గురుకుల విద్యార్థినులు

షాద్‌నగర్: నిత్యం ఎక్కడో ఒక చోట బాలికలు, యువతులు, మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఆడపడుచుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. వారు బయటికి వెళ్లి ఇంటికి క్షేమంగా తిరిగివస్తారన్న నమ్మకం లేదు. అడుగడుగునా ఆకతాయిల వేధింపులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు యుద్ధ విద్యల్లో రాణిస్తున్నారు.

విద్యార్థినుల ప్రతిభ

షాద్‌నగర్ పట్టణ శివారులో ఉన్న నూర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన బాలికల గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు, అదేవిధంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉన్న బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు తెలంగాణ రాష్ట్ర పాఠశాలల, క్రీడల అసోసియేషన్, జపాన్ కరాటే అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందుతున్నారు. ఈ కళాశాల విద్యార్థినులు ఇటీవల ఘట్‌కేసరి, ఎల్‌బీ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో రాణించి పతకాలు సాధించారు. తాజాగా షాద్‌నగర్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు గీత, ఐశ్వర్యలు రాణించి వెండి, రజిత పతకాలను సాధించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

సమాజంలో ఉండే కొందరు వ్యక్తులు మహిళలు, యువతులపై వేధింపులకు గురి చేస్తుంటారు. ఇంట్లో నుంచి ఒంటరిగా బయటికి వచ్చిన వారిని వేధించి అఘాయిత్యాలకు పాల్పడుతుంటారు. అయితే యువతులు ఇంట్లో నుంచి బయటికి వస్తున్నారంటే చాలు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాం, ఎక్కడ ఉన్నామన్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలి. ఏవైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుంది



ఆపదలో ఎదుటి వారి నుంచి ఆత్మరక్షణ పొందేందుకు కరాటే ఎంతో ఉపయోగపడుతుంది. కళాశాలలో ప్రతి రోజు కరాటే సాధన చేస్తున్నాను. వివిధ టోర్నమెంట్‌లలో పాల్గొని పతకాలు సాధించాను.

– కోట ఐశ్వర్య, గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని, షాద్‌నగర్

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



యుద్ధ విద్యలు నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రతి రోజు కొంత సమయాన్ని కరాటే నేర్చుకునేందుకు కేటాయిస్తున్నాను. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు.

– విస్లావత్ గీత, గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని, షాద్‌నగర్

పాఠ్యాంశంలో చేర్చాలి



చిన్నతనం నుంచే యుద్ధ విద్యలో ప్రావీణ్యం పొందాలంటే కరాటేను విధిగా ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చేర్చాలి. అయితే ఏడాది పొడవునా శిక్షణా తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఎత్తిన చెన్నయ్య, కరాటే మాస్టర్